బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు

వినాయక్‌నగర్, నవంబర్ 12: బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (జూనియర్ సివిల్ జడ్జి) వడ్డి హరికుమార్ మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్‌లోని నాగారం 80 క్వార్టర్స్‌కు చెందిన షేక్ కలంధర్ తన బంధువైన 16ఏండ్ల షేక్ థౌఫిక్‌తో కలిసి 2017లో ఆటో నడపుకుంటూ వస్తున్నాడు. ఇంద్రపూర్ వద్ద షేక్ సర్దార్ అహ్మద్ మరో ఆటోతో వచ్చి ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన థౌఫిక్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాదం చేసిన ఆటోలో ప్రయాణిస్తున్న సంతోష్‌కు గాయాలయ్యాయి. ప్రమాదాలకు కారణమైన సర్దార్ అహ్మద్‌కు బాలుడి మృతి కేసులో ఏడాది జైలు, మరో వ్యక్తికి గాయాలైన కేసులో మరో ఏడాది జైలు శిక్షను విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. కొత్త వ్యక్తికి ఆటో ఇచ్చిన యజమాని మహ్మద్ గౌసుద్దీన్‌కు రూ.వేయి జరిమానా విధించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానివి రాక్షసోత్సవాలు : ఎమ్మెల్యే ధన్‌పాల్

మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

వినాయక్‌నగర్, నవంబర్ 12: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించేది విజయోత్సవాలు కాదని, రాక్షసోత్సవాలు అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మండిపడ్డారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఆరు నెలలకే ప్రజల్లో నమ్మకం కోల్పోయిందని, ఏడాదిగా వారు రాష్ర్టాన్ని లూఠీ చేశారని ధ్వజమెత్తారు. ప్రజా పాలన దరఖాస్తులను మూసీలో, ఆరు గ్యారెంటీలను గంగలో కలిపారా అని ప్రశ్నించారు. హామీలు అమలు చేసే వరకు విడిచిపెట్టమని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

సుభాష్‌నగర్, నవంబర్ 12: నిజామాబాద్ సుభాష్‌నగర్ శ్రీరామాలయంలో శ్రీసీతారామచంద్ర స్వామి పవిత్రోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా మొదటి రోజు సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 15వ తేదీ వరకు ఉత్సవాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్పర్సన్ సరళా మహేందర్‌రెడ్డి కోరారు.

చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలి

మండలస్థాయి క్రీడల ప్రారంభోత్సవంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి, నవంబర్ 12: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారిస్తే మెరుగైన భవిష్యత్తు ఉంటుందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని దుబ్బాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 68వ ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడలను ఆయన మంగళవారం ప్రారంభించారు. విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసికోల్లాసం లభిస్తుందని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని కోరుతూ గౌడ సంఘం సభ్యులు.. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు వెంకటరాజారెడ్డి, నాయకులు చెలిమెల శ్రీనివాస్, నర్సయ్య, మిట్టాపల్లి గంగారెడ్డి, సుభాష్, రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

బాసర ఘటనపై ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

సీఎస్‌వోపై చర్యలకు డిమాండ్

టీయూలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

డిచ్‌పల్లి/ ఖలీల్‌వాడి, నవంబర్ 12: బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతి ప్రియ పరామర్శకు వెళ్లిన విద్యార్థి సంఘం నాయకులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఏబీవీపీ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో వర్సిటీలో, నిజామాబాద్ నగరంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను వేర్వేరుగాదహనం చేశారు. టీయూ వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ మాట్లాడుతూ.. ట్రిపుల్ ఐటీలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. స్వాతిప్రియ కుటుంబానికి న్యాయం చేయాలని అన్నారు. బాసరలో విద్యార్థి నాయకులపై దాడిచేసిన సీఎస్‌వో రాజేశ్, సెక్యూరిటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ టీయూ శాఖ ఉపాధ్యక్షురాలు పావని, కార్యదర్శి అమృత్‌కుమార్‌తోపాటు రాకేశ్, సమీర్, బాంధవ్య, హరినాథ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏవోల బాధ్యతల స్వీకరణ

పోతంగల్, నవంబర్ 12: పోతంగల్ మండల వ్యవసాయాధికారిణి గా నిషిత, కోటగిరి ఏవోగా టి.రాజు మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి స్థానిక సిబ్బంది స్వాగతం పలికారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఖలీల్‌వాడి, నవంబర్ 12: జిల్లా కేంద్రంలోని లైబ్రరీలో ఈనెల 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి, కార్యదర్శి బుగ్గారెడ్డి మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహిస్తామని, పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మేక రామస్వామికి నివాళి

సుభాష్‌నగర్/ ఖలీల్‌వాడి, నవంబర్ 12: సాహితీవేత్త మేక రామస్వామి సంస్మరణ సభను హరిద రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యసమాజ్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో కరిపె సూర్యప్రకాశ్, వీపీ చందన్‌రావు, తిరుమల శ్రీనివాస్, గంట్యాల ప్రసాద్, దారం గంగాధర్, నరేశ్‌రావు, వెంకటరమణాచారి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఇందల్వాయి, నవంబర్ 12: ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిపల్లికి చెందిన కల్లుకుండల సాయిలు (39) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై మనోజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సాయిలు టీవీఎస్ ఎక్సెల్‌పై ఇంటికి వెళ్తుండగా రచ్చబండ వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

డిచ్‌పల్లి, నవంబర్ 12: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ విద్యార్థుల మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును ఈనెల 21వ తేదీ వరకు పొడిగించినట్లు పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని, పూర్తి వివరాలు టీయూ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు ఆమె తెలిపారు.

టీయూలో మౌలిక వసతులు కల్పించాలి

డిచ్‌పల్లి, నవంబర్ 12: టీయూలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని లంబాడా స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీవన్‌నాయక్ కోరారు. ఈ మేరకు టీయూ వీసీ యాదగిరిరావును మంగళవారం కలిసి విన్నవించారు. ఆయనవెంట లంబాడా స్టూడెంట్ ఆర్గనైజేషన్ టీయూ కన్వీనర్ హనుమాన్‌సింగ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సిరికొండ, నవంబర్ 12: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం తాళ్ల రామడ్గు గ్రామంలో పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చందూర్, నవంబర్ 12: చందూర్ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. బైక్‌పై వెళ్తున్న చందూర్‌కు చెందిన ఇద్దరిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

16న ఈజీఎస్ ప్రజావేదిక

ఇందల్వాయి, నవంబర్ 12: ఈజీఎస్ సామాజిక ప్రజావేదికను ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చేపపిల్లల విడుదల

డిచ్‌పల్లి/ రుద్రూర్, నవంబర్ 12: మండలంలోని బర్దిపూర్ కోనం చెరువులో ఎంపీడీవో రవీందర్, ఏవో సుధామాధురి మంగళవారం చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్స్యసంపద పెంచడంతోపాటు మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, దమ్మారెడ్డి, దేవరాజ్, సాయిలు, బాల గంగాధర్, స్వామి, జమున, మత్స్యకారులు పాల్గొన్నారు. వర్ని మండలం పాత వర్ని చెరువులో వర్ని ఏఎంసీ చైర్మన్ సురేశ్‌బాబా, తహసీల్దార్ సాయిలుతోపాటు మత్స్యశాఖ అధికారులు, నాయకులు కలిసి చేపపిల్లలను విడుదల చేశారు.

'అధికారులపై దాడి ఆటవిక చర్య'

ఖలీల్‌వాడి, నవంబర్ 12: ఫార్మా కంపెనీ ఏర్పాటు విషయంలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వికారాబాద్ కలెక్టర్, అదనపు కలెక్టర్, రెవెన్యూ, ఇతర అధికారులపై దాడి ఆటవిక చర్య అని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ నాయకుడు కెంపుల నాగరాజు, తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర నాయకుడు హెచ్.రేవంత్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ లచ్చిరెడ్డి, తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల ఆదేశాల మేరకు నిరసనలు తెలుపుతామని పేర్కొన్నారు. ఇలాంటి దాడులతో ఉద్యోగులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పెన్‌డౌన్ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.

పాలకులతోనే కార్మికులకు అన్యాయం

రుద్రూర్, నవంబర్ 12: పాలకుల విధానాలతోనే బీడీ కార్మికులకు అన్యాయం జరుగుతున్నదని, పింఛన్లు రావడం లేదని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ ఆరోపించారు. రుద్రూర్‌లో బీడీ కార్మికులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్మికులు ఐక్యంగా ఉద్యమించి సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూసీఐ నాయకుడు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ వేడుకల్లో సత్యశోధక్ విద్యార్థులు

సిరికొండ, నవంబర్ 12: హైదరాబాద్‌లో నిర్వహించిన స్కౌట్స్ అండ్ గైడ్స్ 75 డైమండ్ జూబ్లీ వేడుకల్లో సత్యశోధక్ విద్యార్థులు ప్రతిభ చూపారు. వారు ఉత్తమ గ్రేడ్, అవార్డులు సాధించినట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య మంగళవారం తెలిపారు. గైడ్ టీచర్ వనిత, విద్యార్థులను అభినందించారు.

డీఈవోకు సన్మానం

డీఈవో అశోక్‌ను సన్మానిస్తున్న మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు

ఖలీల్‌వాడి, నవంబర్ 12: డీఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అశోక్‌ను జిల్లాలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు సుధారాణి, ప్రవీణ్‌కుమార్, డాక్టర్ దశరథ్ యాదవ్, శ్యాంకుమార్, ఫెరోజ్‌ఖాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో

కోటగిరి (పోతంగల్), నవంబర్ 12: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల రాష్ట్ర విద్యా మహాసభల పోస్టర్లను కోటగిరిలో ఎంఈవో శ్రీనివాస్‌రావు మంగళవారం ఆవిష్కరించారు. కామారెడ్డిలో డిసెంబర్ 1,2వ తేదీల్లో నిర్వహించే మహా సభలను విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ కోరారు. కార్యక్రమంలో లత, సువర్ణ జ్యోతి, వంశీ, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

రుద్రూర్, నవంబర్ 12: సమగ్ర కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సర్వే సిబ్బందికి సూచించారు. వర్ని తహసీల్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. గడువులోపు సర్వేను పూర్తిచేయాలన్నారు. ఆయనవెంట తహసీల్దార్ సాయిలు, మండలాధికారులు ఉన్నారు.

కేజీబీవీ తనిఖీ

కేజీబీవీలో బాలికలతో మాట్లాడుతున్న జీసీడీవో భాగ్యలక్ష్మి

ఏర్గట్ల, నవంబర్ 12: స్థానిక కేజీబీవీని మంగళవారం జీసీడీవో భాగ్యలక్ష్మి తనిఖీ చేశారు. మూడు రోజుల క్రితం మండల కేంద్రంలోని కేజీబీవీ భవనంపైకి కోతుల రావడంతో బట్టలు ఆరబెట్టేందుకు వెళ్లిన బాలిక అంజలి భయంతో కిందికి దూకడంతో గాయపడింది. విషయం తెలుసుకున్న జీసీడీవో భాగ్యలక్ష్మి, ఎస్‌జేడబ్ల్యూ హెచ్‌ఆర్సీ బృందం డాక్టర్ కట్కం సామంత్ రెడ్డి, నరేశ్‌గౌడ్, సల్ల నవీన్ పాఠశాలకు వెళ్లి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరోసారి ఇటువంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని బాలికలు, సీఆర్టీలకు సూచించారు.

రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిరసన

బాల్కొండ తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన..

మోర్తాడ్/బాల్కొండ/, నవంబర్ 12: వికారాబాద్‌లో జిల్లాలో కలెక్టర్, తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందిపై సోమవారం జరిగిన దాడికి నిరసనగా మంగళవారం పలు మండలాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కమ్మర్‌పల్లిలో తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్‌ఐ శరత్‌కుమార్, సిబ్బంది నిరసన తెలిపారు. ఎస్సారెస్పీ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. టీఎన్జీవో నాయకుడు రియాజ్ అహ్మద్, డీఈఈలు గంగభూషణ్, సుకుమార్, రఘుపతి, ఏఈఈలు పవన్, మాణిక్యం, టీవోరాజారెడ్డి పాల్గొన్నారు. బాల్కొండ తహసీల్దార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నవీపేటలో తహసీల్దార్ వెంకటరమణ, ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు.

సీఎం చర్యల కారణంగా కలెక్టర్‌కు అవమానం

నందిపేట్, నవంబర్ 12: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లలోని నిరుపేదల భూములు లాక్కోవాలని చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి తీరు కారణంగా ఒక నిజాయితీ ఉన్న కలెక్టర్ గౌరవం మంటగలిసిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్ర అల్లుడికి కోట్ల రూపాయల సంపద సృష్టిద్దామనుకుని ఇలాంటి కార్యక్రమానికి సీఎం పూనుకున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్న సీఎంకు ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

క్రీడాకారులకు అభినందన

విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

చౌట్‌పల్లిలో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో ఆంధ్రయ్య, ఉపాధ్యాయులు

మైథిలిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మోర్తాడ్/వేల్పూర్/ బాల్కొండ, నవంబర్ 12: జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన బాల్కొండ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని అపర్ణ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక కావడంతో మంగళవారం వేల్పూర్‌లో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. డిసెంబర్ 6 నుంచి 9 వరకు ఉత్తరప్రదేశ్ అయోధ్యలో నిర్వహించనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పీడీ ముత్తెన్న, పాఠశాల ఉపాధ్యాయులు సుకుమార్, శ్రీనివాస్, దత్తాద్రి, విజయలక్ష్మి, విఘ్నేశ్, భీరాజ గణేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులు రఘురాం, అమర్‌సింగ్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు. గాంధారి మండలం పేటసంఘం ఉన్నత పాఠశాల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. ఈనెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను, వీరిని తీర్చిదిద్దిన పీడీ నాగేశ్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన అండర్-17 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో బాల్కొండ కేజీబీవీ విద్యార్థినులు మైథిలి, ఆనంది, శ్రీవర్ష పాల్గొన్నారు. జాతీయస్థాయి పోటీలకు మైథిలి ఎంపికైనట్లు ఎస్‌వో భవాని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

లక్ష్మీనారాయణ ఆలయంలో లక్ష తులసి అర్చన

మోర్తాడ్, నవంబర్ 12: కార్తీకమాసంలో వచ్చే ఉత్థాన ఏకాదశి పురస్కరించుకుని కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామంలోని లక్ష్మీనారాయణ ఆలయంలో మంగళవారం లక్ష తులసి దళాలతో విశేష అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడు సముద్రాల అమర్నాథాచార్యుల ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర అవార్డు గ్రహీత గురుమంచి రాజేంద్రశర్మ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీనారాయణ ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం నిర్వహించారు. రెండు గంటల పాటు భక్తులు ఓం నమోనారాయణాయ అంటు భక్తితో స్మరణ చేశారు. అనంతరం హారతి ఇచ్చి మహానైవేద్యాన్ని భక్తులకు తులసి దళాలతో అందించారు.

ముత్యాలమ్మ దేవాలయం వార్షికోత్సవం

రెంజల్,నవంబర్ 12: మండల కేంద్రంలో ముత్యాలమ్మ గుడి వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. మహిళలు భోనాలను ఎత్తుకొని వచ్చి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. హోమం, కలశ పూజ,అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బోధన్, నవంబర్ 12: తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ భవనంలో హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌కు చెందిన మెడివిజన్ ఐకేర్ దవాఖాన ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించింది. విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు వైద్యులు దీప్‌సింగ్, ఆంజనేయులు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజేశ్వర్‌రావు, అసోసియేషన్ ప్రతినిధులు సాయిలు, ఇస్మాయిల్, బాబూరావు, వీరాగౌడ్, కిషన్, పాపారావు, శౌరయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఐఎస్ఐ నాణ్యత ఉన్న మోటర్లు, స్టార్టర్లను వినియోగించాలి

పెంటాఖుర్దులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎన్పీడీసీఎల్ డీఈ (టెక్నికల్) రమేశ్

బోధన్, నవంబర్ 12: రైతులు విద్యుత్ ప్రమాదాలబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ డీఈ, టెక్నికల్ అండ్ సేఫ్టీ ఆఫీసర్ రమేశ్ అన్నారు. మంగళవారం బోధన్ మండలం పెంటాఖుర్దు గ్రామ శివారులోని పొలాల్లో ఎన్పీడీసీఎల్ నిర్వహిస్తున్న 'పొలంబాట' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు ఐఎస్ఐ మార్కు కలిగిన నాణ్యమైన మోటార్లు, స్టార్టర్లు, పీవీసీ పైపులను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. లోవోల్టేజీ సమస్య రాకుండా ప్రతి ఒక్క రైతు బోరుమోటర్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బోధన్ ఏడీఈ నగేశ్, ఏఈ కల్యాణ్, సబ్ ఇంజినీర్లు ఓంప్రకాశ్, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్, నవంబర్12: పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఎదుట మధ్యాహ్న భోజన కార్మిక సంఘం, సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు ఎల్లన్న మాట్లాడుతూ తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎం వనజారెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతిరోజూ 15 ఇండ్లను సర్వే చేయాలి

ఎన్యుమరేటర్లకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచన

అంబేద్కర్‌నగర్‌లో సర్వే వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

రెంజల్, నవంబర్ 12: ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ప్రతిరోజూ 15 ఇండ్లు తగ్గకుండా సమగ్ర సర్వే చేపట్టాలని ఎన్యుమరేటర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన రెంజల్‌లో సమగ్ర సర్వే తీరును పరిశీలించారు. సర్వేలో కుటుంబ వివరాల సేకరణలో ఏవైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు రెంజల్ ఐకేపీ అధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఏ పీడీ సాయాగౌడ్, ఐకేపీ డీపీఎం సాయిలు, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తప్పులు లేకుండా సర్వే చేయాలి

మోర్తాడ్/ బాల్కొండ/ముప్కాల్/ భీమ్‌గల్/, నవంబర్ 12: ఇంటింటి కుటుంబ సర్వేను తప్పులు లేకుండా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అంకిత్ ఎన్యుమరేటర్లను ఆదేశించారు. బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్, ముప్కాల్ మండల కేంద్రంతోపాటు నల్లూర్, మెండోరా మండలంలోని పోచంపాడ్ గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. బాల్కొండ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. బాల్కొండలో ఆయన వెంట విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీధర్, తహసీల్దార్ గంగామోహన్, ఎంపీవో ప్రశాంత్, ఏఎస్‌వో, ఎన్యుమరేటర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ముప్కాల్‌లో ఇన్‌చార్జి తహసీల్దార్ పి.శ్రీకాంత్, ఎంపీవో గౌస్ మోహినుద్దీన్, మెండోరా ఎంపీవో భరత్ చంద్ర ఉన్నారు. కమ్మర్‌పల్లి, ఉప్లూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రాజశ్రీనివాస్ పరిశీలించారు. భీమ్‌గల్‌లో సర్వేను బాల్కొండ స్పెషల్ ఆఫీసర్ మెప్మా పీడీ రాజేందర్ పరిశీలించారు.

సంక్షిప్తంగా..

- **పాఠశాల తనిఖీ**- ఆర్మూర్‌టౌన్, నవంబర్12: ఆలూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆర్డీవో రాజగౌడ్ మంగళవారం తనిఖీ చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రమేశ్, ఎంఈవో నరేందర్ పాల్గొన్నారు.
- **ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ**- మోర్తాడ్, నవంబర్ 12: మోర్తాడ్ మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్ తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టమ్‌లో భాగంగా తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు.
- **మొబైల్ అంబులెన్స్ ద్వారా కంటి పరీక్షలు**- ఎడపల్లి, నవంబర్ 12: దుబ్బతండాలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా అధికార ప్రతినిధి కరటూరి సూర్యనారాయణ ద్వారా గ్రామస్తులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. అన్ని గ్రామాల్లో మొబైల్ అంబులెన్స్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.
- **భవనాల మంజూరుపై హర్షం**- నందిపేట్/ బాల్కొండ, నవంబర్ 12: తపాలా కార్యాలయాలకు నూతన భవనాలు మంజూరైన సందర్భంగా నందిపేట్, బాల్కొండ మండల కేంద్రాల్లో మంగళవారం పీఎం మోడీ, కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నందిపేట్‌లో బీజేపీ నాయకులు, బాల్కొండలో వీడీసీ అధ్యక్షుడు కందారపు రమేశ్, సదర్ పెద్దమనిషి సల్ల నర్సయ్య, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.
- **కరాటే శిక్షణ ప్రారంభం**- ఆర్మూర్‌టౌన్, నవంబర్12: ఆలూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరాటే తరగతులు ప్రారంభమయ్యాయని ఎంఈవో నరేందర్ మంగళవారం తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.
- **కార్యవర్గం ఎన్నిక**- వేల్పూర్, నవంబర్ 12: మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్ల కిశోర్, ఉపాధ్యక్షుడిగా ఎక్కలదేవి రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా మైసల బాలకిషన్, సహాయ కార్యదర్శిగా మైసల రాజగంగారాం, క్యాషియర్‌గా కన్నెపల్లి అరవింద్, సలహాదారులుగా మానేటి లింబాద్రి, పిల్లమారి ప్రహ్లాద్, కన్నెపల్లి మధుకర్, బాస గంగాధర్, పిల్లమారి విజయ్‌ను ఎన్నుకున్నారు.
- **యువకుడికి సన్మానం**- ఆర్మూర్‌టౌన్,నవంబర్12: పట్టణానికి చెందిన సుంకం రాంకీ అనే యువకుడిని ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహ నాయుడు మంగళవారం సన్మానించారు. యండమూరి వీరేంద్రనాథ్ రచించిన 'లోయ నుంచి శిఖరానికి' అనే పుస్తకాన్ని బహూకరించారు. ఉపాధిని స్వయంగా సృష్టించుకున్న యువకుడు రాంకీని యువకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.
- **చెరువులో చేప పిల్లల విడుదల**- బోధన్, నవంబర్ 12: పట్టణంలోని బెల్లాల్ చెరువులో మంగళవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో బోధన్ గంగపుత్ర సంఘం ప్రతినిధుల సమక్షంలో చేప పిల్లలను విడుదలచేశారు. మొత్తం లక్షా 99 వేల 500 చేప పిల్లలను విడుదలచేశారు. ఇందులో బొచ్చ, రావు, బంగారుతీగ చేప రకాలు ఉన్నాయి. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ ఆంజనేయులు, తహసీల్దార్ విఠల్, మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాషా మొయినుద్దీన్, పాషా మొయినుద్దీన్, బోధన్ మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు అబ్బయ్య పాల్గొన్నారు.